




## ముళ్ళపూడి వెంకటరమణ

**మ**ర్నాడు సుబ్బరాజువచ్చి కూర్చో బోతుండగానే రామిరెడ్డిగారు కథ ఆరంభించారు.

అనగనగా ఓహ రాజ్యంలో ఓహ తిరపతయ్య ఉండేవాడు కొంచెం పొగరు మోతుబరి. ఓహ మారాయన ఆ ఊరి ఇస్కూలుమీదికి షైరెళ్లాడు. అక్కడ వీర్రాజని ఒక మేష్టరు పిల్లలకు ఆట లైబుతూ ఒకణ్ణో దెబ్బ వేశాడు తిరప తయ్య అది చూసి అదేవిటని మేష్టర్ని గద్దించాడు. మజ్జెన్నీకేవి టన్నా - డా మేష్టరు. తిరపతయ్య మండిపడ్డాడు. వయసుమీదున్నాడేమో ఆ మేష్టరూ గయ్ మని లేచాడు. తిరపతయ్య జబర్దస్తీగా ముందుకురికి వీర్రాజు దవడమీద సాచి కొట్టాడు. దిమ్మతిరిగిపోయింది. మాటకు మాట ఎదురాడాడు గాని దెబ్బకు దెబ్బ కొట్టే జెబ్బపుష్టి లేదు వీర్రాజుకు. గుడ్ల నీరు గుక్కుకుని జెమాజెట్టీలా ఉన్న తిరపతయ్యకేసి చూస్తూ నిలబడి పోయాడు. ఇదంతా ఆయన్ను వలచిన ఓ పంతులమ్మ కంటబడింది. ఆవిడ లబో దిబోమని నలుగుర్నీ పిలిచింది. రసా భాసయింది.

ఏదో పాడుకూత గూసుంటాడు. లేపోతే తిరపతయ్యవంటి పెద్దమనిషి ఉత్తపుణ్యానికి చెయి చేసుకుంటాడా అన్నాడొక పెద్ద. తిరపతయ్య ఆ




ముక్క దొరకబుచ్చుకుని మర్నాలుగు కల్పించి గొడవచేశాడు.

నాలుగురోజులుచర్చలుజరిపాక ఇంత పొగరుమోతు— మేష్టరుంటే పిల్లల్చెడి పోతారని చెప్పి అతన్ని తీసేశారు పనిలోనుంచి.

ఆరోజున వీర్రాజు పగబట్టాడు— తిరపతయ్యమీద. ఓ రోజున నీకూ వుద్యోగం పోగొడతా జూడుఅని పట్నం వెళ్ళి అష్టకష్టాలూపడి ప్రైవేట్లు చెప్పుకుంటూ పైకి చదివాడు. నాలుగేళ్ళ తరువాత ఉద్యోగం సంపాయించాడు. రెవిన్యూ ఆఫీసులో చేరి తిరపతయ్య పొలాలమీద చెక్కింగుకొచ్చి నానా అల్లరీపెట్టాడు ఇతనూ వీర్రాజు ఊహ తెలిసి, నీపన్జెబుతానుండని ఫిర్యాదులు రాశాడు. పనిజరగలేదు. ఇలాక్కాదెవా రమని ఊళ్ళో నిర్వాకం తండ్రినెత్తిన బడేసి పట్నంవెళ్ళి లంచాలు పెట్టి ఆ ఆఫీసులోనే ఉద్యోగం సంపాయించాడు. వీర్రాజు జాగ్రత్తపడి డిపార్టుమెంటు పరీక్షలు పాసై పై అధికారిగావచ్చి తిరపతయ్యను మన్యం బదిలీ చేయించాడు. ఇంకోరెణ్ణెల్లకు అక్కడ తనిఖీకి వెళ్ళి అతన్ని డిస్మిసు చేయించడానికి సన్నాహాలు చేసుకున్నాడు. తిరపతయ్య భయపడి సెలవుపెట్టి, సెలవుతీరేసరికి మరో ఆఫీసుకు వేయించుకున్నాడు. వీర్రాజు కొద్దికాలంలోనే అక్కడ ఆఫీసరుగా వెళ్ళాడు.

ఇదిపనిగాదని తిరపతయ్య ఉద్యోగం వదులుకుని చిన్న వ్యాపారం పెట్టాడు. వీర్రాజు టాక్సు ఆఫీసరుగా తయారయ్యాడు. తిరపతయ్యకి విసుగేసి ఇంటి

కెళ్ళాడు. ఈడనే ఉంటే సరిగదా వాడెక్కడొస్తాడని అన్నదమ్ములన్నా వినక, వాణ్ణి నిభాయించి నిలబడతానని పంతంబట్టి తనవాటాభూములు తెగనమ్మి అందినంత అప్పుజేసి పట్నంవెళ్ళి పెద్ద పరిశ్రమ పెట్టాడు. బాగా డబ్బు గడించి, పలుకుబడి సంపాయించాడు. వీర్రాజు ఉద్యోగం వదలుకుని, ఆ ఫ్యాక్టరీలో వర్కర్లచేత యూనియన్ కట్టించి నాయకుడయ్యాడు. అతను ఏ అఘాయిత్యం చెయ్యకపోయినా, తిరపతయ్య భయపడి మునిసిపల్ ఎలక్షనుకు నిలబడి చైర్మనుగా ఎన్నికయ్యాడు. అతన్తో పోటీగా వీర్రాజు నిలబడి ప్రతిపక్షంలో కౌన్సిలర్ అయ్యాడు.

అతని బాధలు పడలేక దినదినగండాల్లాంటి ఛార్జీలూ, తీర్మానాలూ తట్టుకోలేక తిరపతయ్య పైకి జరిగాడు. ఎమ్మెల్యే అయ్యాడు.

నాలుగేళ్ళ తరవాత వీర్రాజు అంత పని సాధించేసరికి తిరపతయ్య మినిష్టరై కూర్చున్నాడు...

సుబ్బరాజూ, ఇపుడు చెప్పు. ఓపేడాది తిరిగేసరికి మొత్తంమీద వీర్రాజు పగ సాధించాడు. తిరపతయ్య పరువుదీసి, పరపతి తిరపతికంపించి మినిష్టరుగిరికి రూకలు చెల్లేలా చేశాడు. ఎలా చేశాడంటావు?

"ప్రతిపక్షంతోచేరి దర్యాప్తులు చేసి దుమ్మెత్తిపోశాడా? ఆరోపణలు తెచ్చి నిరూపించాడా? పత్రికపెట్టి ఏకి వదిలిపెట్టి పరువుతీశాడా? ఎమ్మెల్యేలందరినీ మాయజేసి అవిశ్వాస తీర్మానం తెప్పించాడా? చెప్పుచూదాం" అన్నారు రామిరెడ్డిగారు.

"ఇవేవీకాదు. ఈ విద్యకి ప్రతి విద్యలు తిరపతయ్యకూ తెలిసుంటాయి. వీర్రాజు తిరపతయ్య పార్టీలోనే చేరి అతనితో నేస్తంకట్టి, అన్నిటికీ వంతపాడి నీ అంతవాడు లేడని మెరమెచ్చులు పలికి, అగడ్తలో నమ్మించి ఉచ్చులో పడేసుంటాడు. పొగడ్తల పడని వాడుండడుకదా" అన్నాడు సుబ్బరాజు.

రామిరెడ్డిగారు తృప్తిగా నవ్వి "రేపురా" అన్నాడు.